క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా తుకారాం


నియామకపత్రం అందుకుంటున్న తుకారాం

కెరమెరి: బీజేపీ మండల అధ్యక్షుడిగా సెడ్మకి తుకారాం ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రావు ఆదివారం ఆయనకు నియామకపత్రం అందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు తుకారాం కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదివారం డీఎస్పీ రామానుజంకు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా రాజీవ్‌గాంధీ, ఎన్టీఆర్ చౌరస్తాల్లో సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సాయికృష్ణ, సాయికుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

కెరమెరి: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, మాజీ జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. మండలంలోని చిన్నసాకడ(శ్యాంరావుగూడ)లో పెందోర్ జంగు స్మారక కబడ్డీ పోటీలను ఆదివారం వారు ప్రారంభించారు. అనంతరం జంగుపటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెందోర్ ఆనంద్‌రావు, దంబిరావు, జలపతిరావు, సుమిత్రబాయి, సెండే నారాయణ, రాంచందర్, భగవంత్‌రావు, నిర్వాహకులు పెందోర్ మాణిక్‌రావు, శంకర్, సోము, వినేశ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు బయల్దేరిన స్వాములు


బయల్దేరిన అయ్యప్ప స్వాములు

రెబ్బెన: అత్యంత నియమ నిష్ఠలతో 41 రోజుల పాటు అయ్యప్ప దీక్షలు చేపట్టిన స్వాములు ఆదివారం ఇరుముడి కట్టి శబరిమలకు పయనమయ్యారు. మండలంలోని గోలేటికి చెందిన అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం శ్రీకోదండ రామాలయంలో నిర్వహించారు. గురుస్వాములు సూర్యభాస్కర శర్మ, కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం స్వాములంతా ఇరుముడిని తలపై పెట్టుకుని గోలేటి బస్టాండ్ వరకు పాదయాత్రగా వెళ్లారు. అక్కడి నుంచి శబరిమల యాత్రకు పయనమయ్యారు.

నేడు గోదాదేవి కల్యాణం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడలో గల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కల్యాణం, శ్రీవారి పల్లకిసేవ, అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

దహెగాం: సంక్రాంతి పండుగను మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై కందూరి రాజు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పండుగను మూడు రోజుల పాటు కుటుంబ సభ్యులతో సంతోషాల మధ్య జరుపుకోవాలన్నారు. కోడి పందేలు, పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువకులు, చిన్న పిల్లలు గాలి పటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రత.. జీవితానికి రక్షణ

జిల్లాలో ఏటా పెరుగుతున్న రహదారి ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు రవాణాశాఖ, పోలీస్‌శాఖ అధికారులు ఈ నెల 31వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఏటా రోడ్డు ప్రమాదాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- కొనసాగుతున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు


కౌటాలలో అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై


రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కౌటాలలో అవగాహన ర్యాలీ

కౌటాల: జిల్లాలో ఏటా రోడ్డు ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారు. దీంతో బాధిత కుటుంబాలు దిక్కులేనివారిగా మారుతున్నారు. అతివేగం, మద్యం తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ, రహదారి భద్రత నియమాలు పాటించకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఏటా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తూ ప్రమాదాలను నివారించేందుకు ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 38వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ఈ నెల 31 తేదీ వరకు కొనసాగనున్నాయి.

ప్రమాదాల్లో యువతే..

మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో మరణించే వారిలో ఎక్కువ సంఖ్యలో యువకులే ఉండడం కలిచివేసే అంశంగా ఉంది. ప్రమాదాల నివారణకు ప్రజల్లో మరింత అవగాహన సమావేశాలు నిర్వహించాలి. బైక్‌లపై వెళ్లే సమయంలో హెల్మెట్ విధిగా ధరించేలా చూడాలి. వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడితే మరింత కఠిన చర్యలు తీసుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలుశిక్షతో పాటు లైసెన్సులు రద్దు చేయాలి. ట్రాఫిక్ నియమాలు, సరైన లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపిన వారిని కఠినంగా శిక్షించాలి. మైనర్లు బైక్‌లు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. జిల్లాలో గతేడాది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 1290 కేసులు నమోదు చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 133 రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో 60 మంది మృతి చెందారు. 91 మంది గాయపడ్డారు.

వాహనదారులు ఇవి పాటిస్తే మేలు..

- వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించవద్దు.
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదు.
- మద్యం సేవించి వాహనం నడపరాదు.
- మైనర్లు వాహనం నడపకూడదు.
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలి.
- ట్రాఫిక్ నియమాలు పాటించాలి.
- వాహనాలను మద్యం తాగి నడపొద్దు.
- రోడ్డుపై ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు చూసి జాగ్రత్తగా వాహనం నడపాలి.
- గమ్యాన్ని చేరేందుకు అతి వేగం కన్నా ముందుగా బయల్దేరడం మంచిది.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించి ప్రజల్లో చైతన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

– ఎస్. మధుకర్, ఎస్సై, కౌటాల

వాహనదారులు ఒక్క క్షణం..

'వాహనదారులు ఒక్క క్షణం ఆలోచించండి.. రహదారి భద్రత నియమాలు పాటించండి.. ప్రాణం తీసే అతివేగాన్ని వదలండి.. ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు దూరం కాకండి.. మిమ్మల్ని నమ్ముకున్న వారికి కన్నీటిని మిగల్చకండి' అంటూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీసులు, రవాణాశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వాహనదారులకు రహదారి భద్రత ఆవశ్యకతను వివరిస్తున్నారు. రహదారి భద్రత.. మన జీవన భద్రత అని 38వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పలు చోట్ల ప్రచార ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై మధుకర్ హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. వాహనదారులకు రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 45 ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నియంత్రణకు మూలమలుపుల గుర్తింపు, స్పీడ్ బ్రేకర్లు, సూచికలు ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: సంక్రాంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు, చిన్నారులు రంగురంగులతో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన యోగిత ప్రథమ, మీనాక్షి ద్వితీయ, పద్మ తృతీయ బహుమతి దక్కించుకోగా, క్లబ్ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా గుర్రాల హరిప్రియ, స్వప్న, జ్యోతి వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు ఎకిరాల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, చిలువేరు వెంకన్న, గుండ ప్రమోద్, రావుల శంకర్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి, కాచం వినేశ్, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. డీటీడీవో రమాదేవి, ఏసీడీవో శకుంతల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. నాయకులు బలేశ్వర్‌గౌడ్, మసాడే చరణ్, ఆత్రం వినద్, కార్తీక్, కలీమ్, సాయి, నిఖిల్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో క్లబ్ ప్రతినిధులు


ముగ్గులు పరిశీలిస్తున్న డీటీడీవో రమాదేవి

మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం

బెజ్జూర్: ఆదివాసీ గిరిజన గ్రామాల అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని మండల సర్మేడి శంకర్ అన్నారు. మండలంలోని మొగవెల్లి గ్రామంలో ఆదివాసీ నాయకులు ఆదివారం ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మొగవెల్లి నుంచి గూడెం గ్రామానికి రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు. దిండ వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. సద్మెక రమేశ్ ఉన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

రెబ్బెన: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెందిన కుమార్తె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని గంగాపూర్‌కు చెందిన గుర్నులే ఆనంద్‌రావు-కమలాబాయి దంపతులకు కుమారుడు, కుమార్తె సునీత (20) ఉన్నారు. సునీత లక్సెట్టిపేటలోని డిగ్రీ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. సంక్రాంతి పండుగ కోసం నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చింది. తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, ఖాళీగా ఉంటూ టీవీ చూస్తూ ఉంటోంది. ఈ విషయమై ఈనెల 6న తల్లిదండ్రులు ఆమెను మందలించారు. తర్వాత తల్లిదండ్రులు వ్యవసాయ పనుల కోసం వెళ్లారు. ఆ సమయంలో సునీత గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై.. మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సునీత మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

జిజియాబాయి సేవలు మరువలేనివి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్తకాలనీలో ఛత్రపతి శివాజీ తల్లి జీజాబాయి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ తల్లి జీజాబాయి సేవలను కొనియాడారు. ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు ఎల్ములే కిశోర్, నర్గేవార్ రాజు, అఖిల అహ్మద్, సిడాం గణపతి తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ఛత్రపతి శివాజీ మహారాజ్ తల్లి వీరమాత జిజియాబాయిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో జిజియాబాయి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్‌ఐ మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, అంబేద్కర్ యువజన సంఘం మండల కార్యదర్శి దుర్గం సునీల్, నాయకులు హంసరాజ్, శాంరావు, రాజేంద్రప్రసాద్, విలాస్, రోషన్, సందీప్, ప్రతాప్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడలో గల ఛత్రపతి శివాజీ మహారాజ్ భవనంలో జీజాబాయి జయంతిని నిర్వహించారు. ఆరె కుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు గణపతి, దామోదర్, రాజేశ్వర్, రవీందర్, గిరిప్రసాద్, నానాజీ, రాందాస్, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్‌లో స్వామి వివేకానంద జయంతిని వాసవీక్లబ్, వివేకానందసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ జెండా ఎగురవేశారు. అనంతరం 50 మందికి పేదలు, వికలాంగులకు బ్లాంకెట్లు, బియ్యం పంపిణీ చేశారు. స్వామి వివేకానందుడి జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాత శ్రీనివాస్, కృష్ణమూర్తితోపాటు బీజేపీ సీనియర్ నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు, పలు సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో..

జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థిని, అధ్యాపకురాలు తాటిపెల్లి జ్యోతి, పూర్వవిద్యార్థులు వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, సతీశ్, కవిత, ప్రశాంత్, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రధానాచార్యులు కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని సావర్‌ఖెడా ప్రాథమిక పాఠశాలలో సూపర్ 100 విద్యార్థులు ఆదివారం స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. అదే పాఠశాలకు చెందిన విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించగా ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సూపర్ 100 విద్యార్థులు రేణుక, కృష్ణ, హరి, రంజిత్, అక్షర, కార్తీక్ తదితరులు ఉన్నారు.


కెరమెరి: జయంతిలో 'సూపర్ 100' విద్యార్థులు

కౌటాల: మండల కేంద్రంలోని ఆరె కుల సంఘం భవనంలో రాజమాత జీజాబాయి, స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు ధుసుర్‌కార్ వసంత్‌రావ్, నాయకులు దుబ్బుల నానయ్య, వానుపటేల్, ఎల్ములే మల్లయ్య, బండు పటేల్, బోయర్ రాధేశ్యం, మధు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు కోటేశ్వర్‌రావు, ఆకుల నాగేశ్వర్, నర్సింహులు, రమణయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కౌటాల: పూలమాలలు వేస్తున్న నాయకులు


కాగజ్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్ సంఘం నాయకులు


జెండా ఎగురవేస్తున్న మాజీ ఎంపీపీ

చీకట్లు..ఇక్కట్లు

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారి లైట్లు లేక చీకటిమయంగా ఉంటుంది. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆసుపత్రి వరకు సుమారు 200 మీటర్ల దూరం ఉండగా రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు, ఒక వైపు పొదలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతం రాత్రి సమయంలో చీకటిగా ఉంటుంది. విద్యుత్ స్తంభాలు ఉన్నా గ్రామ పంచాయతీ సిబ్బంది లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆ దారి గుండా కాలినడకన వెళ్లాలంటే వారికి భయపడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం ముందు హైమాస్ట్ లైట్ ఉన్నా, భారీ వృక్షాల కారణంగా వెలుగు సరిపోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు.



కోడిపందేల స్థావరంపై దాడి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాస్పెల్లి శివారు పెద్దవాగు సమీపంలో కోడిపందేల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 బైక్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు, నాలుగు కోడిపుంజులతోపాటు రూ.3,020 నగదును స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. గజ్జిగూడకు చెందిన తొగరి సాంబయ్య, గజ్జి అంజయ్య, దర్ని జనార్దన్, మదాసు జనార్దన్, రాస్పెల్లి గ్రామానికి చెందిన నాగోషి రామయ్య, సురేందర్, పెర్క లింగమూర్తి, లహోటి దిలీప్, దహెగాం మండలం జెండాగూడకు చెందిన సదుల్ల ముత్తయ్య, నస్పూరి రాజును అదుపులో తీసుకున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహార్ సంఘం మండల అధ్యక్షుడు పులిబోయిన బండురావ్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్‌లో పోచయ్య స్మారక క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొంటున్నాయని, ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. నాయకులు గోవింద్‌రావ్, వెంకటేశ్, తిరుపతి, శంకర్, నిర్వాహకులు నరేశ్, వెంకటేశ్, లోహిత్, రాహుల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడులు

వాంకిడి: మండలంలోని కనర్‌గాం శివారులో ఆదివారం పేకాట స్థావరంపై దాడులు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. దాడిలో నలుగురిని అదుపులో తీసుకుని, వారివద్ద నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, మొత్తం 8 మందిపై కేసు నమోదైనట్లు తెలిపారు.